నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, శుక్రవారం 8 మార్చి 2024 | SURYAPET

## గుట్టలో నిత్య తిరుకల్యాణం



యాదగిరిగుట్ట, మార్చి 7 : యాదగిరిగుట్ట ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు నిర్వహించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి.

## శివోహం



విద్యుద్దీపాల వెలుగులో పిల్లలమర్రి త్రికుటేశ్వరాలయం

- **మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు**
- **రంగులు, విద్యుత్ కాంతులతో ప్రత్యేక శోభ**
- **అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు**

రామగిరి, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాల్లో ఉత్సవ శోభ నెలకొంది. ఆలయాలు శోభాయమానంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలు, రంగులతో శివాలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడనుండగా.. అందుకు తగట్టే నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాలకు సిద్ధం చేశారు. క్యూలైన్లు, భక్తుల కోసం మంచినీటి సౌకర్యం, షామియానాలు చలువ పందిళ్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, వాడపల్లి, మట్టపల్లి శివాలయాలు, పిల్లలమర్రి ఆలయాలు, చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరాలయం, మేళ్లచెరువు స్వయంభు శంభులింగేశ్వరాలయం, సోమప్ప సోమేశ్వరాలయం వంటి ప్రముఖ ఆలయాలకు పెద్దఎత్తున భక్తులు తరలిరానుండడంతో ప్రత్యేక శ్రద్ధ వహించారు. పానగల్ ఆలయాలకు నల్లగొండ పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి ట్రస్మా ఆధ్వర్యంలో ఉచిత బస్ సౌకర్యం కల్పించారు. పండ్లు, పూలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో భువనగిరి పట్టణంతోపాటు, ఆలేరు, చౌటుప్పల్‌లోని మార్కెట్లు సందడిగా మారాయి. ఉపవాసాల నేపథ్యంలో భక్తులు పండ్లను కొనుగోలు చేస్తుండగా, వ్యాపారులు పండ్ల ధరలు అమాంతం పెంచేశారు.

# ఎల్ ఆర్ఎస్ ఉచితంగా అమలు చెయ్యాలి

## బీఆర్ఎస్ డిమాండ్

- కలెక్టర్లు, ఆర్డీఓలకు వినతిపత్రాల అందజేత
- ప్రభుత్వ తీరును ఖండిస్తూ హాలియాలో ధర్నా
- రెండో రోజూ కొనసాగిన నిరసనలు



ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని కలెక్టర్ వెంకట్రావ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ మంత్రులు గతంలో డిమాండ్ చేసినట్లుగానే ఉచితంగానే ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని బీఆర్ఎస్ ఆందోళనలు కొనసాగాయి. తొలిరోజు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టిన బీఆర్ఎస్ నేతలు, రెండోరోజు గురువారం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల వరకు ర్యాలీలు నిర్వహించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అనధికార లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి అప్పటి సీఎం కేసీఆర్ ఎల్ఆర్ఎస్‌ను ప్రకటించారు. దీనికి అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ ముఖ్య నేతలు అడ్డుపడ్డారు. ఎల్ఆర్ఎస్‌పై కోర్టులో కేసులు వేసి ఆటంకాలు సృష్టించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేకుంటే తాము అధికారంలోకి వచ్చాక తాము ఎలాంటి రుసుమూ లేకుండా చేస్తామని ప్రజలను మభ్యపెట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వంటి నేతలంతా ఉచిత ఎల్ఆర్ఎస్‌పై నోరు మెదపడం లేదు. దాంతో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు ఆందోళనలకు పిలుపునిచ్చింది. కాంగ్రెస్ మంత్రులు గతంలో చెప్పిన మాదిరిగానే ప్రస్తుతం ఉచితంగానే ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తొలి రోజు అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టింది. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు. గురువారం పలు చోట్ల నిరసనలు కొనసాగాయి. కలెక్టర్లు, ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేశారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి, ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగానే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ హరిచందనకు వినతిపత్రాన్ని అందజేశారు. దేవరకొండలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్థానిక ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ఉచిత ఎల్ఆర్ఎస్ కోసం ఆర్డీఓకు విజ్ఞాపన పత్రం అందజేశారు. హాలియా ప్రధాన కూడలిలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సూర్యాపేటలో గులాబీ శ్రేణులు కదం తొక్కాయి. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఎల్ఆర్ఎస్‌కు ఫీజులు వసూలు చేయకుండా ఉచితంగానే అమలు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేశారు.



మేళ్లచెర్వులో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

### మేళ్లచెర్వు జాతర ఏర్పాట్ల పరిశీలన

మేళ్లచెర్వు, మార్చి 7 : మేళ్లచెర్వు స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు జరుగనున్న మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ గురువారం పరిశీలించారు. భక్తులకు తాగునీరు, శానిటేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయం వెలుపల ఉన్న క్యూలైన్లను పరిశీలించి టికెట్ రేట్లను ఆరా తీశారు. ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీలు జరిగే ప్రాంతాలను, ఎన్ఎస్పీ కాల్వలో నీటిని పరిశీలించారు. అంతకుముందు మై హోం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రం, వాటర్ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట సీఈఓ అప్పారావు, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ అజ్గర్‌అలీ, ఆలయ ఈఓ కొండారెడ్డి, చైర్మన్ శంభిరెడ్డి, సభ్యులు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు : ఎస్పీ

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సిబ్బందికి సూచించారు.

స్థానిక కస్తూరి వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనాతో కలిసి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. సీసీ కెమెరాలతో పాటు 500 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, కోదాడ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# మన ఖిలా.. ఇక ఇలా...

## భువనగిరి ఖిలాకు సకల హంగులు

- అభివృద్ధికి రూ. 118 కోట్ల కేటాయింపు
- తొలి విడుతగా రూ.69 కోట్లు మంజూరు
- కోటపై వసతుల కల్పన.. రోప్ వే, స్కైవాక్, రాక్ క్లైంబింగ్
- సౌండ్ అండ్ లైట్ షో, గార్డెన్లు, నీటి కొలను ఏర్పాటు
- అభివృద్ధి పనులకు వర్చువల్‌గా ప్రధాని మోదీ శ్రీకారం

నమూనా చిత్రం



యాదాద్రి భువనగిరి, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : చారిత్రక భువనగిరి కోట సకల హంగులతో అలరారనున్నది. ఏకశిల కొత్త సొబగులతో టూరిజం స్పాట్‌గా మారనున్నది. ఖిలా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 118 కోట్లు ఖర్చు చేయనుండగా, తొలి విడతలో రూ. 69 కోట్లు మంజూరు చేసింది. అందుకు సంబంధించిన పనులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రెండేండ్లలో పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు.

భువనగిరి ఖిలా 147 ఎకరాల్లో విస్తరించి ఉంది. 610 మీటర్ల ఎత్తయిన ఈ కొండ తెలంగాణలోని ఉర్లుకొండ, ఉంద్రుకొండ, అనంతగిరి కంటే ఎత్తయినది. అండాకారపు ఏకశిలా పర్వతమైన ఈ కొండ దక్షిణం నుంచి చూస్తే తాబేలులా, పడమర నుంచి చూస్తే పడుకున్న ఏనుగులా కనిపిస్తుంది. కొండపైకి వెళ్లేందుకు ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి మార్గాలు ఉన్నాయి. హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో పర్యాటకులను ఆకర్షిస్తున్నది. బస్సు, రైలు మార్గం అందుబాటులో ఉంది. సెలవు దినాల్లో ట్రెక్కింగ్ నడుస్తున్నది.

### రూ. 118 కోట్లతో అభివృద్ధి

ఉమ్మడి రాష్ట్రంలో భువనగిరి కోట నిరాదరణకు గురైంది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే ఖిలాకు గుర్తింపు దక్కింది. రూ.118 కోట్లతో అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు చేశారు. మొత్తం నాలుగు దశల్లో పనులు చేపట్టనున్నారు. నిధులు కూడా నాలుగు దశల్లో విడుదల కానున్నాయి. తొలి విడతలో భాగంగా 69 కోట్లు మంజూరు చేశారు. డీపీఆర్ రూపకల్పనను ఎల్అండ్‌టీ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ ప్రతినిధులు ఇటీవల పలుమార్లు భువనగిరి కోటను సందర్శించి అధ్యయనం చేసి డీపీఆర్‌ను రూపొందించి.. ప్రతిపాదనలను ఫైనల్ చేసింది.

### నిధుల కేటాయింపు..

భువనగిరి ఖిలాపై అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. 10.73 కోట్లతో రోడ్ల అభివృద్ధి, పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తారు. రూ. 6.07 కోట్లతో ఎంట్రెన్స్ ప్లాజాను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు సైట్ ఇంప్రూవ్‌మెంట్, పర్యాటక వసతులు కల్పించనున్నారు. రూ.4.30 కోట్లతో వారసత్వ కట్టడాల నిర్మాణ పనులు, రూ.12.18 కోట్లతో సౌండ్ అండ్ లైట్ షో, వసతుల కల్పనకు సుమారు రూ. 3 కోట్లు, ఐటీ ఇంటర్వేషన్‌కు రూ. 3.72 కోట్లు ఖర్చు చేయనున్నారు. రోప్ వే నిర్మాణానికి రూ.15.19 కోట్లు వెచ్చించనున్నారు.

### అడ్వెంచర్ అనుభూతులు..

పునరుద్ధరణలో భాగంగా అడ్వెంచర్ అనుభూతులు పొందేలా ఖిలాను అభివృద్ధి చేయనున్నారు. ఖిలాపై నీటి కొలను పునరుద్ధరించనున్నారు. రాప్పెలింగ్, రాక్ క్లైంబింగ్, హైకింగ్, వాల్ క్లైంబింగ్, పెయింట్ బాల్, ఆర్టిఫిషియల్ వాటర్ ఫాల్, లిఫ్ట్ స్కైవాక్, ఓవర్‌నైట్ క్యాంపింగ్, మూన్‌లైట్ డిన్నర్ సదుపాయాలు కల్పించనున్నారు. ఖిలాపై ఉన్న జైలును ఇంటర్‌ప్రెటేషన్ సెంటర్‌గా మార్చనున్నారు. ఫోర్ట్ ఏరియాను అభివృద్ధి చేయడంతో పాటు రెస్టారెంట్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇప్పుడున్న మెట్లను రెనొవేట్ చేయనున్నారు. గుట్టపై స్కల్ప్చర్ గార్డెన్, రాక్ గార్డెన్, రోప్‌వే స్టేషన్, పార్కింగ్ ఏరియా, ఫుడ్ ప్లాజా, కన్వెన్షన్ సెంటర్ నిర్మించనున్నారు.

## మారనున్న భువనగిరి ఖిలా రూపురేఖలు

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



వర్చువల్ విధానంలో కోట అభివృద్ధి పనుల మాడల్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మార్చి 7 : కేంద్ర ప్రభుత్వ పథకం స్వదేశీ దర్శన్ 2.0 కింద భువనగిరి కోట మొదటి దశ అభివృద్ధి పనులను ప్రధాని నరేంద్రమోదీ గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. భువనగిరి కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భువనగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులతో కోట రూపురేఖలు మారనున్నాయని, దశాబ్దపు కల నెరవేరబోతుందని పేర్కొన్నారు. కోట అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.118 కోట్లు కేటాయిస్తూ మొదటి దశ పనులకు గానూ రూ.69 కోట్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ నిధులతో రోప్‌వే, రోడ్లు, పార్కింగ్ వసతులు, ప్రారంభ ద్వారం, పర్యాటకులకు వసతులు, హరితవనాలు, విశ్రాంతి భవనాలు, సౌండ్ లైటింగ్, సాంకేతిక అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, జడ్పీటీసీలు బీరు మల్లయ్య, అనూరాధ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ, కేంద్ర ప్రభుత్వ టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ మౌతోశ్ నాస్కర్, రాష్ట్ర టూరిజం జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ నేత్ర, జిల్లా టూరిజం అధికారి ధనుంజనేయులు, జిల్లా అధికారులు, హెరిటేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



### 15 నుంచి ఒంటి పూట స్కూళ్లు

రామగిరి, మార్చి 7 : రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు ఒంటి పూట బడులు నిర్వహించాలని డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాలలు నడుపాలని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలు నిర్వహణ పాఠశాలల్లో మధ్యా హ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంట వరకు పాఠశాలల కొనసాగించాలని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

## మహిళాభ్యున్నతితోనే దేశం పురోగతి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

సూర్యాపేట, మార్చి 7 : మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించినప్పుడే దేశం పురోగతి సాధిస్తుందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఓర్పు, సహనంతో కుటుంబాలను నెట్టుకొచ్చినట్టే సమాజాన్ని తీర్చిదిద్దాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం ఇద్దరు మహిళా అదనపు కలెక్టర్లు పని చేయడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి మహిళకు సంక్షేమ పథకాలు అందేలా అధికార యంత్రాంగం చూడాలని కోరారు. ఈ సందర్భంగా 15 మంది దివ్యాంగులకు స్కూటీలు, 6 బ్యాటరీ వీల్ చైర్లు పంపిణీ చేశారు. వినికిడి లోపం ఉన్న మరికొందరికి పరికరాలను అందించారు.

మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గులు, వ్యాస రచన, పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, ఎంపీపీలు కుమారి, పార్వతి, మల్లె రాణి, జడ్పీటీసీలు అనిత, కృష్ణకుమారి, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## వైభవంగా రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం

- నేడు మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం



రామలింగేశ్వర స్వామి కల్యాణంలో భాగంగా మాంగళ్యధారణ చేస్తున్న ప్రధానార్చకుడు నరసింహరాములు శర్మ

యాదగిరిగుట్ట, మార్చి7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ శివాలయంలో గురువారం మూడో రోజు మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం శివాలయంలో నిత్యహవనం, శివపంచాక్షరీ జపం, నందీశ్వర పారాయణం, పంచసూక్తపఠనం, మూలమంత్ర జపం, పారాయణాలను నిర్వహించారు. అనంతరం రుద్రహవనం జరిపారు. సాయంత్రం పారాయణాలతో మూలమంత్ర జపాలు, పారాయణీకులతో స్తోత్ర, వేద పారాయణాలు, మంత్ర పుష్ప పఠనం, సోమకుంభార్చనలు, మూల మంత్ర పారాయణాలు నిర్వహించారు. సాయంత్రం7:30 గంటలకు స్మార్తాగమ సంప్రదాయ రీతిలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లౌకిక జీవనానికి సంబంధించిన అంశాలను ప్రబోధించారు. భార్యాభర్తల్లో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదనే వాస్తవాన్ని తెలియజేసేదే అర్ధనారీశ్వర లీలగా శివాలయం ప్రధానార్చకుడు గౌరీభట్ల నరసింహరాములు శర్మ వెల్లడిచారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ భాస్కర్‌శర్మ, ప్రధాన పురోహితుడు గౌరీభట్ల సత్యనారాయణశర్మ, ఏఈఓ రఘు, పర్యవేక్షకుడు చంద్రమౌళి పాల్గొన్నారు.



విద్యుద్దీపకాంతులతో వెలిగిపోతున్న రామలింగేశ్వరస్వామి ఆలయం

### నేడు శత రుద్రాభిషేకం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో అభిషేకాలు నిర్వహించనున్నారు. రాత్రి లింగోద్భవకాలమున మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం జరుగనున్నది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అభిషేకానికి రూ.300, శత రుద్రాభిషేకానికి రూ.516(ఇద్దరికి) టికెట్‌ను నిర్ణయించారు.










